# బాస్టర్డ్

పద్మ కడుపుతో వుందని తెలియగానే గతుక్కుమన్నాడు సంజీవ రావు. మళ్ళీ మరో పీడకల ప్రారంభం కాబోతోందన్న మాట. "వద్దు స్వామీ. ఇది నిజం కాకుండా చూడు" అని దేవుడికి మొక్కుకున్నాడు.

చెప్పడానికే మొహమాట పడిపడి చెప్పింది పద్మ. నిజానికి చెప్పలేదు. తనకే తెలిసిపోయింది. బాత్‌రూంలో పద్మ స్నానం చేస్తుండగా చటుక్కున సంజీవ రావుకి జ్ఞాపకం వచ్చింది. చేతిలోవున్న పేపర్ని నేలమీద పారేసి - బాత్‌రూం తలుపు దగ్గర మకాం పెట్టాడు. "అవున్రా చంటి - అప్పుడే నలభై అయిదు రోజులయిపోయింది. ఈసారి మూడు రోజుల కిచిన్ డ్యూటీ-"

"షటప్‌రా అబ్బాయి" అంది లోపల్నుంచి పద్మ. ఏదీ తిన్నగా మాట్లాడదు. "ఒరేయ్ -నిజం చెప్పరా - నాకీసారి కిచెన్ డ్యూటీ యివ్వలేదేం?"

బాత్‌రూం తలుబ కొస్త ఓరగా తెరిచింది. తడిసిన మల్లెపువులాంటి సగం శరీరం కనిపిస్తోంది.

"చూస్తున్నావుగ? నీళ్ళోసుకొంటున్నా"

"తెలుస్తూనే వుంది - నేనడిగిన ప్రశ్నకి సమాధానం"

"అదే చెప్తున్నానోయ్ మొద్దూ. రెండో నెల దాటాక నీళ్ళుపోసుకోవడం అయిపోయినట్టే - ఇప్పుడింకా పోసుకొంటున్నట్టే కదా?" గలగలా నవ్వింది.

పద్మ స్నానం ముగించుకొని టర్కీ టవల్ వొంటికి వొదులుగా చుట్టుకొని బయటకు వచ్చేసరికి బాత్‌రూం పక్కగోడ దగ్గరే చదికిల పడి పోయివున్నాడు సంజీవరావు.

"ఏరా కన్నా – యిదేంటి?" అతని వేపువొంగింది.

"నువ్వు చెప్పేది నిజమేనా చంటీ – నన్ను ఏడిపించకమ్మా" అన్నాడు జాలిగా.

పద్మకి చర్రున కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. నీళ్ళతో దొరికిపోయినందుకే కోపం తెచ్చుకొంది తనమీద తనే. 'అందుకే ఈ దరిద్రం షీకాయి'. కన్నీళ్ళకి వెంటనే అబద్ధం దొరకలేదు.

ఇద్దరి కళ్ళు కలిశాయి. ఇద్దరి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అతని కన్నీటికి అతికే అబద్ధమూ దొరకలేదు. అలాగే తడివొళ్ళు అతనికి ఆనించి గోడదగ్గరే కూలబడింది పద్మ.

"చూడబ్బాయ్. గాడ్ పెద్ద బ్లాక్‌మెయిలర్. కాని అతనూ ఓడిపోయే రోజు రాదంటావా? ఎన్నిసార్లు మోసం చేస్తాడు? ఇది మూడోసారి – డామిట్"

ఒకసారి పద్మ ముఖాన్ని రెండు చేతుల్లోకీ తీసుకొని "ఈసారి ఏమయినా అయితే చంటీ– ఐవిల్ స్టాబ్ హిమ్" అన్నాడు ఆవేశంగా

"ఎవరిని?"

"దేవుడిని"

పగలబడి నవ్వేసింది – నవ్వుతూ – అలాగే అతని వొళ్ళో వాలిపోయింది. చిన్న టర్కీ టవల్ అంత అందమయిన శరీరాన్ని దాచలేక –యిరకాటంలో పడుతోంది.

"ఈసారి అబ్బాయ్ – నాకు కొండముచ్చులాంటి రాస్కెల్ కావాలి –నోనో – వాడు అడోల్ఫ్ హిట్లర్‌లాగో, ఈదీ అమీన్ బాబాలాగో"–

ఎంత కసి, ఎంత నైరాశ్యం మనసులో గూడు కట్టుకోకపోతే–బంగారం లాంటి కలల్నీ, మన్మధుడు లాంటి కొడుకుల ఆలోచనల్నీ – అటకమీద పారేసి–ఆలోచనల్నికూడా అలంకరించుకోడానికి భయపడిపోయి, వాటిని వీలయినంత అసహ్యంగా తయారుచేస్తూ– ముందు ముందు నష్టపోయినా ఫరావాలేదనుకొంటూ సరిపెట్టుకోవడం తేలికవుతుంది–

పసిపిల్లాడిలాగ బావురుమన్నాడు సంజీవరావు. తాచుపాములాగ అతని వొళ్ళోంచిలేచి–

"అదిగో – అందుకే – పిరికి గొడ్డు – ఐ హేట్ యూ ఫూల్" అంటూ గదిలోకి వెళ్ళి భడాల్న తలుపేసుకొంది.

పెళ్ళయిన ఈ ఎనిమిదేళ్ళూ ఎన్ని ఉదారంగు కలల్ని పోగుచేసుకొన్నారు? పుట్టని మొదటి కొడుక్కి – పసుపూ, నీలం కలిపిన కలనేతతో ఇద్దరూ కలిసి బుల్లి స్వెట్టర్ అల్లారు. పసుపు పద్మది. నీలం సంజీవది.

"ఒరేయ్ అబ్బాయి. నీలం పూలు ఒకటి ఎక్కువయినా నిన్నుచంపుతా – వాడు పెద్దయాక–నాన్న ప్రేమకి చిహ్నంగా నువ్వు రెండు వరుసలు 'నీలం' చూపిస్తే – నా గుండె పగిలిపోతుంది"

"నీకు తెలీని దొంగవరస ఒకటి అల్లుతా"

పద్మ మీద పడి కరిచింది సంజీవరావుని.

పళ్ళు చెయ్యి మీద గాట్లు పడ్డాయి. మూడు రోజులు మందు పెట్టి తనే సపర్యలు చేసింది.

"నన్ను క్షమించరా – యింత ఘోరమయిన పళ్ళు వాకున్నాయని నాకే తెలీదు" అంది గాట్లు పడిన చేతిని ముద్దులాడుతూ–

"చంటీ – మన బాబుగాడిని కరవనని మాటియ్యి – నిన్ను క్షమిస్తా – కరవడం నీకు వ్యసనం" –

సంజీవరావు నెత్తిమీద చెయ్యేసి –భక్తిగా ప్రతిజ్ఞ చేసింది – "ఎట్టిపరిస్థితుల్లోనూ పుట్టబోయే బాబు మీద నోరు చేసుకోను"

కాని ఆ బాబు వాళ్ళ ఆలోచనల్లో నాలుగు నెలలు మాత్రమే బతికాడు అబార్షన్ అయిపోయింది. ఆ రాత్రి మొదటిసారిగా పద్మ చేత ఓ పెగ్గు బ్రాందీ తాగించాడు సంజీవ రావు. తను నాలుగు పెగ్గులు తాగాడు – విషయమేమిటంటే పెగ్గులు యిద్దరికీ కొత్త. ఆ రాత్రంతా సంజీవరావు వాంతులు చేసుకొన్నాడు. పద్మ టైఫాయిడ్‌తో 40 రోజులు మంచం ఎక్కింది.

"టైఫాయిడ్ నిన్ను శలాక లాగ తయారుచేసిందిరా" ఆట పట్టించేవాడు సంజీవరావు పద్మని.

అతన్ని "ఒక్కటి చెప్పు అబ్బాయి – నాతో సెక్స్ నీకిష్టం వుందా లేదా?" సమాధానం చెప్పేలోగానే నోరుమూసి "సమాధానం ఏదయినా నాకు కొడుకు కావాలి. ప్లీజ్! ఏం చేస్తే నీకు నచ్చేంత అందంగా తయారవుతానో చెప్పు"

ఆమెని ఎత్తుకొని మంచంమీద కుదేసేవాడు. నిజానికి తరువాత ఎప్పుడూ పద్మలో సెక్స్‌ని చూడలేకపోయాడు. ఆమె అందమయిన సీతాకోక చిలుకని పొదిగే 'కకూన్'లాగా కనిపించేది.

"మైగాడ్ – నాకో కొడుకు నియ్యి – నాకోసం కాదు – పద్దుకోసం" అనుకొనే వాడు భక్తిగా. ఆమెతో సెక్స్ అనుభవించినపుడల్లా, అదొక పవిత్రమయిన యజ్ఞం. లక్ష్యంతో జరిపే సెక్స్ ఫలించదు. రుచించదు. కాని పద్మ తనకి బంగారం కప్పు. ఆ పని బంగారం కప్పులో తాగే 'కాపు సారా'.

"ఏమయింది? నేను అరవైయేళ్ళ దానిలాగయిపోయానా? కాదు డామ్‌ఫూల్–సెక్స్ కంటే సెక్స్ ఫలితం మీద నీ దృష్టి–నియతం కురు కర్మత్వం' గీతాకారుడి ఉవాచ–అది సెక్సయినా సరే"

రెండోసారి కడుపు ఓ ఆర్టిస్టిక్ ఫీట్. ఇద్దరూ తిరుపతికి వెళ్ళి జుత్తు యిచ్చారు. నున్నటి తలకి సిల్కు రుమాలు కట్టుకొన్న పద్మని చూస్తే – హాలీవుడ్ స్టార్ మియాఫారో గుర్తుకొచ్చేది. ఏదో సినిమాలో లాగే అతి జుగుప్సాకరంగా ఆ కడుపు. కానీ ఆ లోపల 'రొస్కోల్'కి ఎంత విలువ?

"పుట్టాక తల్లిని అంత వూరించినందుకు జీవితమంతా వాడ్ని ఏడిపిస్తాను" అనేవాడు.

"ఆరకంగానయినా కడుపు వచ్చినందుకు వాడిని నెత్తిమీద పెట్టుకోవాలి చిన్నా" – అనేది పద్మ.

సరిగ్గా రెండు నెలలు యిద్దరూ స్వర్గంలో వున్నారు. పద్మకి నోటి దగ్గర దాకా అన్నీ తనే చేసేవాడు సంజీవ రావు. తినడం ఆవిడే చేసుకోవాలి కనక నిస్సహాయంగా ఆ పని ఆమెకే వదిలేశాడు–

"ఏమిటీ పిచ్చి – బాబు పుట్టేసరికి నేను వంట మరిచిపోతాను" అనేది పద్మ.

"బాబుని కన్న తల్లిని వంట చేయిస్తానా?"

"నన్ను మహారాణీలా చూసేంత డబ్బు నీదగ్గర ఎక్కడ చచ్చింది!"

"దొంగతనాలు చేస్తాను – మంత్రుల్లాగ లంచాలు పడతాను–నాకొడుకును పెంచుకోడానికి"

"కొడుకు పుట్టి నిన్ను దొంగని చేస్తే వాడ్ని నేను క్షమించను"

"వాడినేమన్నా అంటే నీ ముక్కు కొరుకుతా"

మాటల్లో –ఆకలిని మరిచిపోయి – ఎన్నో రాత్రులు గడిచిపోయేవి. ఒక్కో తెల్లవారుజామున మూడు గంటలకి గుర్తు చేసుకునేవారు. ఆ రాత్రి వంట చేసుకోలేదని. అప్పుడు సైకిల్ మీద బయలుదేరి చిన్న ఫ్లాస్కులో దిక్కుమాలిన 'సూప్' తీసుకొచ్చి బ్రతిమాలి బ్రతిమాలి పద్మ చేత తాగించేవాడు.

"నాకెందుకీ శిక్ష బేబీ" అనేది.

"నా కొడుకుని నీ కడుపులో పెంచుతున్నందుకు"

సృష్టి రహస్యం తెలిసిన వాళ్లెవరయినా వుంటే వాళ్ళ సంకల్ప బలంతో ఆ అమ్మాయి గంజి తాగినా బంగారంగా మార్చే దారి చెప్పేవారు.

అయితే సృష్టి రహస్యం –రహస్యంగానే మిగిలిపోవడానికి కారణం – ఆ ఆనందం మరో పన్నెండు రోజులే వుంటుందని–

ఆ రాత్రి ఆత్మహత్య చేసుకొందామని – మణి కట్టుదగ్గర నరాలు కోసుకొంది పద్మ. సంజీవ రావుకి రెండు నరకాలు –పోయిన కొడుకు –పుట్టబోయే ముందు కోరికల 'ఆశ'కీ ఆలంబన అయిన తల్లిని దక్కించుకోవడం.

ఆ రోజుల్లో – రోజుకి రెండు గంటలే నిద్రపోయేవాడు. కారణం 22 గంటలు కళ్ళనీళ్ళు కార్చడం వల్ల ఏ రెండు గంటలో పద్మ సొమ్మసిల్లి నిద్రపోయేది కనక. ఆమెకి కాపలా అతను.

ఆ తర్వాత ఆమె శరీరం నిప్పులాగ కాల్చేది సంజీవరావుని. ఆమె మండుతున్న అగ్ని జ్వాలలా కనిపించేది. దాదాపు పది నెలలు ఇద్దరూ పిల్లల గురించి, సెక్స్ గురించి ఆలోచించ లేదు.

ఆరు నెలలు ఆలస్యంగా తెలిసింది. పద్మ ఆ రోజుల్లోనే నిద్ర మాత్రలకీ అలవాటు పడింది. వొళ్ళెరగకుండా గంటలకొద్ది నిద్రపోయేది. అలవాటు గుర్తుపట్టి డాక్టర్ దగ్గరికి వెళ్ళాడు సంజీవ రావు. కథంతా విని – డాక్టర్ మొదటిసారిగా వైద్య శాస్త్రంలో లేని వైద్యం ఒకటి చేశాడు – ఆమెని నిద్ర మాత్రలు వేసుకోనివ్వమని.–

తల్లి కాలేని ఆమె దైన్యతని జయించే మాత్రలు వైద్య శాస్త్రంలో లేవు. క్లినిక్ వదిలి వెళ్తోంటే సంజీవ రావుని వెనక్కి పిలిచి – "వీలయినంత త్వరగా ఆమె తల్లి కావడం మంచిది"

"ఆ ఆలోచన వస్తేనే నాకు–"

"మనిషిని పశువుని చేసే వైద్యం మాకు తెలుసు" అన్నాడు డాక్టర్.

మొదటిసారి పద్మ పెదాల మీద తన పెదాలు మోపినపుడు మూర్ఛరోగిలాగ వణికింది పద్మ.

"నాకు భయంగా వుంది" అంది వణుకుతూ.

తనకూ భయంగానే వుంది

నిస్సహాయురాలైన అమ్మాయిని రేప్ చేస్తున్నట్టు ఫీలయ్యాడు. "మరొక్కసారి నా బిడ్డను భరించు. నిన్ను జీవితాంతం మల్లెపువ్వులాగ చూసుకుంటాను" అనుకొన్నాడు. ఆమె ముఖం చూడలేక పోతున్నాడు. మసక వెలుగులో ఆమె కళ్ళనీళ్ళు తగిలాయి.

తల్లికావడానికి ఓ భయంకరమయిన త్యాగం చేస్తున్నట్టుగా ఆశగా అతని చేతిలోకి వొదిగిపోయింది పిట్టలాగ. ఇదేం సెక్స్? తనతో కోరికని పంచుకొంటున్నందుకు అతని గుండెల్లో అమితమయిన కృతజ్ఞత ఆమెపట్ల. ఆమెకి బురదనీట్లో ప్రయాణం చేశాక దూరంగా కనిపించే బంగారం లాంటి చంద్రకాంతి పుష్పం కొడుకు. ఓ రాత్రికి చూస్తే పద్మ ఇంకా నిద్రపోలేదు.

'ఒరేయ్– బాబుకి భుట్టో అని పేరు పెడతారా' అంది.

"ఇంకేమయినా పిచ్చి పేరుందా పోనీ" వాడి కోసం ఎదురు చూడకూడదని, ఆ అనుభవాన్ని వీలయినంత ఇన్‌సిగ్నిఫికెంట్ చేయ్యాలని ఆమె ఆత్రం. అయితే విష్ణువు మీద హిరణ్యా కశ్యపుడి ద్వేషంలాగ– ఆ అనుభవాన్ని గురించిన ఆలోచనలో పుట్టని 'భుట్టో' విశ్వరూపం దాలుస్తున్నాడు.

ఎట్టకేలకు మళ్ళీ నెలతప్పింది పద్మ. కొత్త కొత్త దేవుళ్ళ అడ్రసులు వెతుక్కొని పూజలు చేశారిద్దరూ. గడ్డి పోసమ్మ, మైసమ్మ, అప్పన్న, పోలిగాడు – ఎవరయినా – ఏ రాయి తన కొడుక్కి జీవలక్షణం నేర్పుతారో, ఏ రాయి "తొమ్మిది నెలలు బతికి ఈ భూమి మీదకి దూకడం – రెండు ప్రాణాలకి అవసరం రా ఈడియట్!" అని వాణ్ణి దీవిస్తుందో!

క్షణక్షణం ఆమె కడుపుని తడువుకొన్నాడు సంజీవ రావు. "గాడ్! ఆ వెధవ పుట్టేలోగా ఆ బంగారుని పిచ్చివాడిని చెయ్యకు" మొక్కుకొనేది పద్మ. బిడ్డకోసం దేబిరింత

శరీరాన్ని బలహీనం చేసేసింది. అయినా తన ప్రాణం పోదు. ఆ గాడిద పుట్టాలి – రెండుసార్లు ఊరించి ఆలస్యంగా దూకిన ఆ గాడిదని తనివితీరా చెవి నులమాలి.

"ఓసారి బ్రాందీ తాగాలని వుందిరా" అంది పద్మ ఓ అర్థరాత్రి. నిర్ఘాంత పోయాడు. 'కష్టాన్ని మరిచిపోడానికి అది తాగాలి. నువ్వు జబ్బు పడ్డావు'

"ఒరే అబ్బాయ్– కడుపుతోవున్న పెళ్ళాం కోరిక తీర్చకపోతే నీకే పాపం"

కొనితెచ్చాడు– కాని చాలా చాలా సోడా కలిపి రెండు గుక్కలు తాగించి, బ్రతిమాలి – ఆ గ్లాసు పారబోశాడు. పుట్టబోయే కడుపు మీద ఏమ్మాత్రం లక్ష్యం లేదు అనుకోడానికి బ్రాందీ చిన్న సింబల్ ఆమెకి. అంతే.

సంజీవరావు కంగారు చూసి "నిజం చెప్పు. ఆత్రం నా ఆరోగ్యం గురించా, ఆ దొంగ రాస్కెల్ గురించా? వాడికోసమయితే పుట్టగానే వాడి పీక నులిపి చంపుతాను"

సంజీవరావు నవ్వాడు. "నీలో ఈర్ష్య తెప్పించిన కారణంగానే ఆ భుట్టోగాడినీ ప్రేమిస్తాను"

అమ్మ కడుపులో ఏడు నెలలు బతికాడు బుట్టో.

కడుపులో వాడి కదలికలు చూసుకొని నిద్రపోయే పద్మ పొట్ట దగ్గర గూడు కట్టుకొని గడిపాడు సంజీవరావు.

ఆరోజుల్లోనే సంజీవరావు అతని జీవితంలో ఎన్నడూ చెయ్యని పని చేశాడు. రేషన్ ఆఫీసులో లంచం పట్టాడు. పుట్టబోయే బిడ్డకి పెరాంబులేటర్, బిడ్డ పుట్టాక చెప్పకుండా పద్మకి బహుమతిగా యివ్వడానికి వెంకటగిరి జరీ చీర, ఖరీదయిన బ్రాందీ బాటిలూ, ఓ ఉన్ని స్వెట్టరూ – ముందుగానే నిలోఫర్ ఆస్పత్రిలో డాక్టర్ చెప్పిన తేదీలలో రూం బుక్ చేసి పెట్టాడు.

ఆ రోజుల్లోనే సంజీవరావు నెరిసిపోతున్న పక్క వెంట్రుకలకి నల్లరంగు వేశాడు. ఆఫీసుకెళ్ళే తోవలో రోజూ కనిపించే గుడ్డి బిచ్చగాడికి అయిదు రూపాయలు దానం యిచ్చాడు. మొదటిసారిగా అర్థంకాని ముద్దుల ఇంగ్లీషు సినిమా చూశాడు. రాత్రి పడుకోబోయే ముందు పద్మ కడుపు చుట్టూ సిల్కు కండువా చుట్టేవాడు.

ఆ రోజుల్లోనే రెండు సంఘటనలు సంజీవరావుకి తెలియకుండానే జరిగిపోయాయి. పద్మ శరీరంలో క్రమంగా తెల్ల కణాల సంఖ్య తగ్గిపోతూ వచ్చింది.

నిలోఫర్ ఆస్పత్రిలో ఓ డాక్టరు అసమర్థత కారణంగా తన బిడ్డ చచ్చిపోయినందుకు ఓ పేషెంట్ తండ్రి డాక్టర్ని కొట్టాడు. అయితే ఆ రోజుల్లో హిరోషిమా మీద ఆటంబాంబు పడినా సంజీవరావు జీవితంలో మార్పు ఏమీ రానక్కర లేదు. మదర్ థెరిస్సాకు మరో గుండెపోటు వచ్చినా అతను తెలుసుకొనే వాడు కాదు.

సెప్టెంబరు 28వ తేదీ రాత్రి పదీ పన్నెండుకి పద్మకి రక్తస్రావం ప్రారంభమయింది. సంజీవరావు నెత్తిలో మొదటి పిడుగు పడింది. పద్మని అమాంతం ఎత్తుకొని వీధుల్లో –

అందరూ నిర్ఘాతపోయి చూస్తుండగా – ఆటోదాకా పరిగెత్తాడు. పద్మకి మెల్లగా స్పృహ తప్పుతోంది.

రాష్ట్రపతికి గుండె నొప్పి వచ్చినా – అంత హుటాహుటిన ఆసుపత్రికి చేర్చలేక పోయేవారు. పదకొండు నిముషాల్లో పద్మ నిలోఫర్ ఆసుపత్రిలో వుంది.

అప్పటికి 48 గంటలుగా డాక్టర్లు తమతోటి డాక్టర్‌కి జరిగిన అవమానానికి నిరసనగా పనులు మానుకున్నారు.

ఆసుపత్రి వరండాలో భుట్టోగాడు సరిగ్గా 38 రోజులు తొందర పడి పుట్టాడు. పద్మ రక్తం మడుగులో వుంది.

సమ్మె ఉధృతంగా సాగుతోంది.

తల్లికీ బిడ్డకీ ఉన్న బిడ్డపేగుని కత్తిరించమని ఏడ్చాడు సంజీవ రావు. మొత్తుకున్నాడు. కేవలం గంటన్నర ఆలస్యంగా ఓ ముసిలి మంత్రసాని కేవలం దయతో ఆ పని చేసింది.

సమ్మె ముమ్మరంగా సాగుతోంది. ఆత్మగౌరవం కోసం డాక్టర్లు పోరాడుతున్నారు.

సరైన టైము చూసుకొని పుట్టని కారణంగా భుట్టోకి ఈ ప్రపంచం స్వాగతం పలకలేదు.

"బాబీ ఎలా వున్నాడురా అబ్బాయ్" అంది పద్మ మగతలో.

మాంసపు ముద్దలాగవున్నాడు భుట్టో. చెప్పడానికి భాష సహకరించలేదు సంజీవరావుకి.

"మన హక్కుల పరిరక్షణలో ఎన్నాళ్ళయినా సమ్మె" – మాటలు సరిగ్గా వినిపించడంలేదు సంజీవ రావుకి.

ఎదురుగా రోడ్‌మీద వెలిసిపోయిన గాంధీ. దక్షతతో వాడుకోవడం తెలీని జాతికి ఎంత పదునైన ఆయుధం యిచ్చావయ్యా!

"బాస్టర్డ్!!" అని ఆ ఆసుపత్రి దద్దరిల్లేలాగ గావుకేక పెట్టాడు సంజీవ రావు.

(ఇటీవల హైదరాబాదు నీలోఫర్ ఆసుపత్రి డాక్టర్ల సమ్మె కారణంగా బలయిపోయిన పసిపిల్లల గురించి దినపత్రికలలో వచ్చిన వార్తలు చదివి.
– రచయిత)

–ఆంధ్రప్రభ వీక్లీ, దీపావళి *10.11.1996*

*****